# వచన గబ్బిలం

( జాషువ గబ్బిలంకు వచనాకృతి)

చార్వాక రామకృష్ణ







పాయసి ప్రచురణలు

# వచన గబ్బిలం

(జాషువ గబ్బిలంకు వచనాకృతి)

**చార్వాక రామకృష్ణ**

ప్రచురణ :

**పాయసి ప్రచురణలు**

పోరంకి - కృష్ణాజిల్లా

**వచన గబ్బిలం**

రామకృష్ణ

మొదటి ముద్రణ : సెప్టెంబర్ 1996
రెండవ ముద్రణ : జూలై 2013

అట్టమీది బొమ్మ : అక్బర్

ప్రచురణ :
పాయసి ప్రచురణలు,
ప్లాట్ నెం. 46, విష్ణుపురం కాలనీ, పోరంకి, కృష్ణాజిల్లా - 521137
మొబైల్ : 9492230198

ప్రతులకు :
చార్వాక ఆశ్రమం, నిడమర్రు, (వయా) మంగళగిరి, గుంటూరుజిల్లా-522 503
నవోదయ పబ్లిషర్స్, ఏలూరు రోడ్డు, విజయవాడ
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాదు.
దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాదు.
సహచర, సుందరయ్య పార్కు వద్ద, బాగ్‌లింగం పల్లి, హైదరాబాదు.
మంచి పుస్తకం, కలక్టరు ఆఫీసు ఎదుట, ఒంగోలు.

*e book : www.kinige.com*

ప్రింటింగ్ :
శ్రీశ్రీ ప్రింటర్స్
విజయవాడ - 520 002
సెల్ : 9490634849

వెల : రూ. 40.00

# వచన గబ్బిలం

చిక్కిన కాసుతోటే తృప్తిపడే అమాయకుడు, బొక్కెడుబువ్వతో ఆకటి మంటను చల్లార్చుకొనే దీనమూర్తి, నాలుగు దిక్కులున్న లోకంలో తన కంటూ ఒక దిక్కులేని అరుంధతీ ముద్దుబిడ్డ భారత సవిత్రికి కడగొట్టు బిడ్డగా జన్మించాడు – పూప వయస్సులో వలస వచ్చిన ముద్దుల తెలుగు కవిత్వానికి అండగా నిలిచిన దక్షిణదేశాధీశుడైన రఘు నాధనరపాలుడు పాలించిన తంజావూరి మండలానికి దక్షిణ భాగంలో ఆ పరమ గర్భ దరిద్రుడు నీతి మంతుడుగా కాపురముండాడు.

ఈనిష్ఠ దరిద్రుడి కులాన్నీ – సంపదనూ కబళించి దేహంలోని రసాన్ని పీల్చి సమాజం పిప్పిచేసింది. భారత వీరుని పాదం ఎక్కడ కందిపోతుందోనని చెప్పులుకుట్టి జీవనం చేస్తూవుంటాడు. ఒక్కనాడైనా ప్రాలుమాలి తన ధర్మాన్ని విస్మరించలేదు.

భారత భూమి ఇతని సేవకు అప్పువడ్డది.

ఈతని రెక్కల కష్టం లేనిరోజున సస్యలక్ష్మి పండి పులకరించటానికి సందేహిస్తుంది. వాడు చెమటోడ్చి ప్రపంచానికి భోజనం పెడతాడు. కాని అతనికి మాత్రం భుక్తిగడవదు, అతని తలమీద పులిమిన బురదను కడిగి కరుణతో చూద్దామని ఆకాశగంగ కూడా తలంచదు. ఈతని నైవేద్యంవల్ల అంటుపడితే, త్రిమూర్తులకు గూడా కూడు దొరకదు.

పాముకు పాలు – చీమకు పంచదార – మేపుకొనే కర్మభూమిలో పుట్టిన ధర్మ దేవతకూడా, ఈ కటిక దరిద్రుడున్న చోట వుండటానికి వులికిపడే జబ్బు వుంది.

ఈతణ్ణీ ఉద్ధరించే దేవుడేలేదు; మనిషి మాత్రం ఎట్లా కనికరిస్తాడు? అతడు చేసుకొన్న పాపకారణమేదో, అతనికే యింతవరకు తెలియదు.

ఆ నిర్భాగ్యుడి రక్తాన్ని పారణచేసి, పెద్దమ్మ జీవనం చేస్తూ వుంటుంది. అతని గాలి సోకితేనే నాలుగు పడగల హైందవ నాగరాజు కసరి బుసకొడుతుంది.

కులం లేని నేను కొడుకుల్ని పుట్టించి, ఈ అఖాతంలోనే తోయాలి కదా! పుట్టు బానిసనైన నాకు పెళ్ళి యెందుకు? అని ఆలోచించి బ్రహ్మ చర్య దీక్షను జరుపసాగాడు.

ఒకనాడా నిరుపేద ఉదయం నుంచి సాయంకాలం దాకా రక్తమోడ్చి కష్టంచేసి, అటు సూర్యుణ్ని సాగనంపి – ఇటు తానింటికొచ్చాడు. ఉన్న కలోగంజో తాగి, పక్కమీద

మేను వాల్చాడు. ఏనుక్కి మదం కమ్మినట్లుగా కటికచీకటి రోదసీ గర్భంలో కమ్మింది. మహానటుడు శివుడు సంధ్యా నాట్య క్రీడమాని శివారవాల్ని ఆరంభించాడు.

ఆ సమయంలో ముక్కు మొకం వున్న చీకటి ముద్దలాగా వున్న గబ్బిలం వొకటి ఆ పేదవాని కుటీరంలో తిరగటం మొదలెట్టింది. దాని రెక్కల గాలికి, ఆ నిరుపేద చిన్ని ఆముదపు దీపం అల్లన ఆరిపోయింది.

గుడిసెలోని దీపాన్ని ఆరిపి దయ్యపు పిల్లలాగా తిరుగుతున్న ఆ ముని పక్షిని చూచేటప్పటికీ, ఆ నిర్భాగ్యుని మనోవీథిలో కొత్త కొత్త వూహలు చిగురించాయి. దుఃఖంతో కందిన మనస్సులోని తన వృత్తాంతాన్ని చెలిమితో ఆ పక్షికి విన్నవించుకోవటం మొదలు పెట్టాడు.

ఈ మదోన్మత్త ప్రపంచంలో నిరుపేదలకు పులుగూ పుట్రాగాక, వేరే ఆప్తులుగాని చుట్టపక్కాలుగాని వుండరు. అతన్ని కన్నీటి ధారలు చారికలు గట్టి ఆ విషయాల్ని వ్యాఖ్యానిస్తున్నాయి.

ఓ పక్షి చెలియా! నీకు స్వాగతం! ప్రవిమల దేవాలయంలో నివాసం వుంటూ, మాలాంటి మనుష్యులు పొందరాని గౌరవంతో తులతూగే గబ్బిలాల రాణివి.

అమ్మా! నీ కొడుకులకూ తల్లక్రిందులుగా చేసే నీ తపస్సులకూ, గుడి గోపురాలకూ శుభమేకదా!

ఈ లోకమంతా కళ్ళుమూసి మైమరచి గాఢ నిద్రలో మునిగి పోయింది. ఇంతకాళరాత్రి నా యింటిలో ఏదో వెదుకుతున్నావు కానీ, ఇక్కడ లవవేశం కూడా ఆనంద కిరణాలు కనబడవు.

సోదరీ! నిన్ను బహిష్కరించు భూవలయం. ఇది అంటరాని వాడున్న నిషిద్ధమైన గృహం. నీవు సర్వదేవతల సన్నిధిలో ప్రసాదాలు ఆరగిస్తూ వుంటావు. ఎంతో పుణ్యరాలవు. తిండిలేని కటిక పేదల ఇంటిలోకి బేలతనంగా వచ్చావేమిటి?

ఇది హృదయం లేని లోకం సుమా! సాయం కాలం పడమటి దిక్కుగా, ఉదయాన తూర్పు దిక్కుగా నడచే సనాతన ధర్మధేనువులు పిదికిన పాలు పేదవాడికి దొరకవు – బ్రహ్మ మొదలైన దేవతలు భాగ్యవంతుడి ఆజ్ఞకు భయపడి ఏ మాత్రం పెదవిని కదల్పలేరు.

ఏటా బొమ్మల (విగ్రహాల) పెళ్ళిళ్ళు చేయటానికి వందలూ, వేలూఖర్చు చేస్తారు. కానీ, ఆకటి చిచ్చుచే దుఃఖితులైన పేదల పకీరుల ఖాళీ పాత్రల్లో ఒక్క మెతుకు కూడా ఈ భరత భూమి విదలించదు.

ముప్పై మూడు కోట్ల దేవతలు ఎగబడ్డ ఈ దేశంలో పేదవాడి ఆకటి మంట చల్లారుతుందా?

అమ్మా! లోభ మనస్తత్వంతో గురువులు ఎల్లపుడూ ఏదో పరమార్థం చెపుతున్నట్లు

బోధచేస్తూ వుంటారు. ముక్కుకు సూటిగా వుండే యుక్తులుపన్ని 'మహాపరాధినని' చెప్పి మోక్షమార్గం చూపిస్తారమ్మా!

'నేను లేకపోతే వేదాంతరథం సాగదని' – దాంభికాన్ని ప్రదర్శిస్తారు.

పక్షి సన్యాసినీ! సంసారం దిద్దుకుంటూ, ఉన్నత స్థానంలో నివశిస్తూ పగలంతా ముని వృత్తిలో వుంటావు ఇంతరాత్రి వేళ కష్టాల కడలిలలో తేలియాడే దరిద్ర మూర్తులను ఓదార్చటానికి వచ్చావా? ఎంత దయామయురాలవమ్మా – నిజంగా అకలంకమైన మర్యాదకు తగినదానవు. నన్నోదార్చటానికీ కొండల గుండెలు కరిగి సెలయేళ్ళ రూపంలో నలుదిశలా పారుతున్నాయి – కాని, సోదర ప్రజల కళ్ళవెంట ఒక్క కన్నీటిచుక్క గూడ వెలువడదు.

సూర్యునితో సమానమైన తేజస్సుగల వాళ్ళు – యోగవిద్యానిధులు – పుట్టకతోటే తపస్సు చేసే వృత్తిలో వున్న వాళ్ళు – దయామయ మనుస్కులు – పరుల శ్రేయస్సును కోరేవాళ్ళు – మహాత్ములు పక్షిరాజైన గరుత్మంతుని స్తుతినాలకించి చెట్టు కొమ్మల్ని విడిచిన వాళ్ళు – అయిన వాలఖిల్య మునీంద్రులు నీకు చుట్టా లేగదమ్మా నీకు నమస్కరిస్తా! దయ చేసినా విజ్ఞప్తిని ఆలకించవా?

పిట్టలరాణీ! ఈ ప్రశాంత రాత్రి సమస్త లోకాన్ని బుజ్జగించి నిద్రపుచ్చుతోంది. కాని, మందులేని అంటరాని తనపు వ్యాదితో బాధపడే దురదృష్టవంతుణ్ణి నన్ను మాత్రం మరచి పోయింది.

కర్మ సిద్ధాంతం పేరుతో నోరు కట్టివేసి స్వార్థలోలురు నా భుక్తిని అనుభవిస్తున్నారు. కర్మ – అంటే ఏమిటో? దీనికి నాపై కక్ష దేనికో? ఈశ్వరుడితోటే రుజువు చేయించు.

ఆలయంలో నీవు వ్రేళాడుతూ వుండేప్పుడు శివుడి చెవి నీకు కొంత దగ్గరగా వుంటుంది పూజారిలేని వేళచూచి నా జీవిత చరిత్రను విన్నవించు.

చాలా పొద్దుపోయింది; రాత్రి స్త్రీకి వయసుమీదబడి ముసలితనం పైన బడ్డది. అదుగో! ఆమె జుట్టు తెల్లగా అయింది. వేట వ్యాపారం ముగించుకొని నీ పొరుగు గూబలు గూళ్ళకు చేరుతున్నాయి.

తళుకులీనే నీ రెక్కల గాలితో విసరి, నా శ్రమను పోగొట్టావు. నాపై ప్రేమను కురిపించావు. నీవు గావించిన ఈ గొప్ప ఉపకారానికి, తిరిగి నేనేమీ బహూకరణ ఈయలేను. ఈ విషయంలో నీకు అప్పుపడ్డా.

పక్షిణీ! నీవు నమస్కరిస్తే, వాటికి గర్వించి నిక్కి నిక్కి నడవటానికి నాకు ఉద్యోగ బలంలేదు, నీ కళాశక్తిని చూచి అసూయ పడటానికి నేను కులము యోగ్యతలున్న వాడినిగాను. అంతేగాదు, స్వార్థంతో నిన్ను పనిముట్టుగా వాడుకోవటానికి కడుపునిండిన భాగ్యవంతుణ్ణి కాదు; తప్పులు చూపి, నీతిని బోధించి దొరతనం చెలాయించటానికి మతస్థుణ్ణీ కూడా కాను.

గబ్బిలపు జెలియా! జంతులక్షణాలూ – పక్షిలక్షణాలు కలిగి విచిత్రమైన ఆకారాన్ని దాల్చిన నీ మొకం చూడటానికి ఈ లోకం అంగీకరించదు ఇట్లాంటి శకునాలుకానీ – పాత పట్టింపులుకానీ – ఈ పేదవాడికి లేవు హాయిగా రావచ్చును, రా.

నా మనస్సులోని దిగులును పోగొట్టి ఈశ్వరుడికి నా సందేశాన్ని అందిస్తావా?

ధర్మానికి పిరికితనం ఎప్పుడూ లేదు; సత్యవాక్యానికి చావులేదు; నీవు సృష్టివి – ఈశ్వరుడు సృష్టికర్త – విశ్వనాధుడి ముందు నిలబడటానికి నీవు భయపడవలసిన పనిలేదు.

పరోపకారిణీ! మనుషులు చేరటానికి వీలుకాని – నివాసస్థానాల్లో వుండే పరమేశ్వరుడికి నా నమస్కారాలను కానుకగా యిమ్ము, ఒకవేళ ఏదైనా కారణం వల్ల ఈశ్వరుడు ఇక్కడలేకుండా వెండికొండమీద వుంటే, అక్కడికిగూడా వెళ్ళు; అది నీకు పెద్ద కష్టంగాదు. ఒకపూట ప్రయాణం సరిపోతుంది.

ఆకాశంలో తెల్లగా దూది పింజలు చల్లబడ్డట్టుగా, ఉత్తర దక్షిణాలకు దారిలాగా కనిపిస్తుంది. అది పాలపుంత. దాన్ని కాశీకి పోయేమార్గమంటారు. ఆదారినే పోయావంటే, భూతస్వామి ఈశ్వరుడు నీకు కనిపిస్తాడు. సూర్యోదయమైతే, నీకు చత్వారం వచ్చి దారి తప్పుతావేమో గదా!

గొడుగులాగా రెక్కలి పర్చుకొని, ఆకాశంలో నీవు ప్రయాణం చేసేటప్పుడు మేఘుడు చిత్త జల్లుల ముత్యాలను నీ మీద చల్లుతాడు.

ఖగభామినీ! లేత సంధ్యా సమయకాంతులకు కెంపులెగజిమ్మినట్టున్న పడమటి కొండపై కాలూని – సెలయేటి నీటిలో ఈతలు కొట్టి విహరించే చల్లని పిల్లగాలులచే సన్మానం పొంది – ఎత్తైన కొండ కొమ్ములకు తాకి తురాతునలైక మేఘువు గుంపు మీద గంతులేసి – కలహంస పొదిగి పిల్లల్ని చేసే ఆకాశగంగ అరణ్యభూముల్లో తిరిగి – చిలుకలు కొరికితే తేనెలూరే తీయటి పండ్లారగించి, కొన్నాళ్ళపాటు ఈ కుటిల సంసారపు దిగులు మరచిపోయిరా!

అమ్మా! సాత్వికాహారిణీ! తపస్సు చేయటంవల్ల నీ మనస్సు చల్లని జాలి వెన్నెలతో విలసిల్లుతుంది. నా కన్నీటి గాథను అర్థం చేసుకోవాలంటే, ఆర్ద్ర హృదయం కూడా కొంత అవసరం.

బిడ్డల్నికని పాలిచ్చే దొడ్డ తనం వున్న పక్షిదొరసానివి. నాకడ్డుపడటానికి దిగివచ్చిన కామధేనువవు. నా మనవిని ఆలకిస్తావుగదా!

ఆయుష్మంతులైన నీ కుమారులూ – నీ మగడూ – దీనినంగీకరించి, నీ ఔదార్యగుణాన్ని సందేహించకుండా మెచ్చుకొంటారు. ఎత్తైన కొండ కొమ్మలలోని శివుడి వాసస్థానంలో ఊయేలలూగి కృతార్థురాలవై తిరిగిరా!

పక్షిరమణీ! నీ చిన్ని పొట్టలో యింత నీరు – యింత ఫలహారం వుంటే చాలు, ఎన్ని దేశాలు తిరిగినా నీకు కొదువలేదు. నీవు నాలాగా పుట్టుబానిసవు కావు.

ఒకవేళ నీకేదైన ఆలస్యమయినా ఫరవాలేదనుకొంటే, దారిలో ఎదురైన గుళ్ళూ – గోపురాలూ చూస్తుపో; ఆకాశంలో పయనించే నీకు అడవులూ – కొండలూ – అడ్డురావు. సుడిగాలులు చెలరేగితే ధర్మసత్రాలలో వుండవచ్చు. కానీ, పిడుగులు పడ్డా పాపినైన నాకు మాత్రం అక్కడ ప్రవేశించే యోగ్యతలులేవు.

అక్కడక్కడా ఫలాలతో నిండిన వనాలలో విందు ఆరగిస్తూ, విశ్రామ మణీ మందిరాలలో నిద్రిస్తూ ముందుకు సాగిపో, అట్లా వెళుతూ వుంటే, యెన్నో పుణ్య స్థలాలు కంటికి కనిపిస్తాయి.

అందాలు చిందే తంజావూరికి సమీపంలో తెలుగు సువాసనలు గమగమ గుబాళించే ప్రదేశం వుంది. అది రఘునాధ రాయల ఆస్థాన భూమి.

శ్రీకృష్ణదేవరాయల యెడబాటు చీకట్లు తెలుగుదేశపు నలుమూలలా ముసురుకొని మసలే సమయంలో – గొప్పదైన తెలుగు సాహిత్యలక్ష్మి దారి బత్తెముతో తంజాపురం వంక తరళి వెళుతున్న వేళలో – చేమకూర వేంకటకవి తెలుగు భాషాలలితాంగి శ్లేషపలుకుల్ని అలవాటు చేసే తరుణంలో – పచ్చపచ్చని ముద్దుపళని ముద్దు కవిత్వం శృంగార రసాన్ని కురిపించే కాలంలో – ఘనుడైన క్షేత్రయ్య, మువ్వగోపాలుడి పూజ చేయటానికి గంటం అందుకొన్న రోజుల్లో – అపరకృష్ణరాయలు రఘునాధరాయలు సత్కీర్తిమణిమయ ప్రదేశాన్ని కట్టుకొన్నాడు.

దీనితో నీ శరీరం వుప్పొంగుతుంది. ఉప్పొంగుతున్న దేహంతో సరస్వతీ మహలు చూచి, తంజాపుర రాజుల సభను పరామర్శించి అక్కడి నుంచి వుత్తరానికి వెళ్ళు.

ద్రావిడ భూముల్ని దాటిపోయేటప్పటికీ, వాడిపోని శౌర్యాన్ని కళ్ళకు కట్టే, తెలుగు పొలిమేరలు నేత్రాలకు విందుచేస్తూ ప్రత్యక్షమౌతాయి.

యతీ – ప్రాసాలేని సంస్కృతభాషా కీకారణ్యంలో వున్న భారతమనే వేదంలో పదిహేను పర్వాలకు తెలుగు తనం కల్పించిన తిక్కనకు నివాసస్థానమైన నెల్లూరు నగరం గోచరమౌతుంది. ఆ పట్టణానికి నమస్కారాలు సమర్పించు, ఆ ప్రక్కనే వున్న దొడ్డదైన పెన్నా నదిలో స్నానమాడు.

ఒక్క పలుకులోనే నెల్లూరు నెరజాణలు సత్కపుల్ని కూడా తికమకలు పెడతారనే పుకారువుంది అది నిజమో? అబద్ధమో?

తరువాత హంపీక్షేత్రం ఎదురవుతుంది. దాన్ని చూచిపో! ఒకప్పుడది తెలుగు రాజ్యపు సిరిసంపదలకు కేళీరంగం. కాని, నేడు ఆ సంపద మెరుపులు ఆరిపోయాయి. నీ

బంధువులు చాలామంది కొంపలుగట్టుకొని అక్కడ నివాసం వుంటున్నారు. వాళ్ళంతా నీకు ఆనందాన్ని సమకూరుస్తారు.

ఆ రోజుల్లో సిరికి పరదా పద్ధతీమానిపారో–! యేమో! రత్నాలను రాసులు రాసులుగాబోసి హంపీ వీధుల్లో అంగళ్ళలో అమ్మారు. మూరు రాయల గండడైన కృష్ణరాయలు ఆంధ్రదేశాన్ని పాలించిన నాటి గొప్ప తనాన్ని తలచుకొంటే నేటికీ ఒడలు పులకరిస్తుంది.

అసూయతో శత్రుభూపతులు కరకు కత్తుల్ని చేబూని శరీరాన్ని నజ్జు నజ్జుగావించినా కళ్ళల్లోపొగలు సమసిపోకుండా భీకరాకారుడిగా వున్న ఉగ్రనరసింహుడి ముందు ఒక్క నిమిషం నీవు నుంచోగలిగితే వీరయోధులు నిన్ను ధైర్యవతిగా లెక్కిస్తారు.

ఏనుగులాంటి రాతిగణేశుని విగ్రహం ఒకటి ఆ హంపీలో వుంది. దాని నిగనిగలు నేటికీమాయవు; ఆ గణేశుని నున్నటి బొజ్జ మీద తుమ్మెద కూడా కాలు ఆనించలేదు. శిల్పకళా సౌందర్యాన్ని తుంగభద్రానికి అప్పగించి, దద్దమ్మలైపోయిన తెలుగువారి విద్యానగరంలో కానుకగా ఒక కన్నీటిచుక్క రాల్చు.

సరసుడైన కృష్ణరాయ నరపతి స్వారి చేసిన పారసీక గుర్రాల గిట్టలతో దున్నిన భూముల్లో ఆనాడు తెలుగు సుందరీమణులు దిగంతాల వరకు విజయాంకురాలను నాటుకొన్నారు. అవి ఫలించిన సుప్రతిష్టలను గరిసెలనిండా నింపారు.

ఓ మునిపక్షినీ! మూరు రాయరగండ బిరుదాంకితుడైన కృష్ణ రాయలీనాడు విద్యానగర రాజవీధుల్లో వూరేగడు; పారశీక గుర్రాల బేరగాళ్ళు ఈ రోజున అక్కడ పట్టుడేరాలు వేయరు; మదించిన భద్ర గజాలు ఇనుప రోకళ్ళతో ఈదినాన సాధన చేయటం లేదు; మరఫిరంగుల తెల్లదొరల దండు ఈ పూట తెలుగు సైన్యాన్ని భర్తీ చేయదు; మణిమయమైన ఆంధ్ర సామ్రాజ్య రథం పదహారో శతాబ్దంలో భూమిలో కుంగిపోయింది; కృష్ణరాయల రాజధానీ నగరంలో తెలుగు ప్రొద్దు కూకింది; అంతే – ఇంతవరకూ తెల్లవారనే లేదు.

కంచర్ల శ్రీకృష్ణజనపాలుడు పాలించిన నగరాన్ని దున్నించి నారుపోసి, వినుకొండ సార్వభౌముడు రాయన భాస్కరుని కోట బురుజులు ఒక్క వూపుతో నేలకొరిగేట్టు తన్ని, పల్నాటివీరుల మేటి మగటిమి నిప్పు కలను నాగులేటి నీటిలో కలిపి, సాటిలేని కొండవీటి సామ్రాజ్యపు టౌన్నత్యాన్ని ఉక్కు కత్తుల బావికప్పగించి, నులివెచ్చని నెత్తుటి కాలువలో చేతులు కడుగుకొన్న కాలపురుషుడి భయంకర దుండగాలను తలచుకొని – మనసులో – లోలోన కుమిలి నలిగిన గుంటూరు మండలాన్ని పరామర్శించి వెళ్ళు, నీజన్మ ధన్యమౌతుంది.

అమ్మా! పక్షి సుందరీ! సూర్యుడికి వన్నె బెట్టే యిద్దరు భాస్కరులు పాలించగా తన మేనుకి సొగసులు దిద్దుకొన్నది గుంటూరు సీమ. తక్కిన సీమలలో ఇది చాల పెద్దది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1994**

* * *

**Read other books of Charvaka Ramakrishna @**

http://kinige.com/kbrowse.php?via=author&name=B.+Ramakrishna&id=100